# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 | సంచిక :184 | ప్రచురణ : హైదరాబాద్ | శనివారం,16-05-2026 | పేజీలు: 8 | వెల : 3- 00


## 2034 తర్వాత జాతీయ రాజకీయాల్లోకి..

# అప్పటి వరకు నేనే సీఎం




2034 లో రాష్ట్రంలో కాంగ్రెస్ ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానన్నారు సీఎం రేవంత్ రెడ్డి. అప్పటి వరకు తానే సీఎంగా కొనసాగుతానని చెప్పారు.జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ గాంధీ తర్వాతి స్థానంలో ఉండాలన్నదే తన లక్ష్యమని అన్నారు.

సోనియా, రాహుల్,ప్రియాంక గాంధీలతో తనకు ఉన్న చొరవ ఉందని.. వారి వద్ద తన మాట చెల్లుతుందన్నారు రేవంత్ . రాహుల్ గాంధీకి నిజానికి ప్రధాని కావాలనే కోరిక లేదని, కానీ దేశం కోసం ఆ బాధ్యత తీసుకోవాలని తానే ఆయనను ఒప్పించినట్లు రేవంత్ వెల్లడించారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి తీసుకురావడమే రాహుల్ గాంధీ లక్ష్యమని అన్నారు రేవంత్. బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసుపై రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. కొడుకు మీద కేసు నమోదైతే బండి సంజయ్‌ను అరెస్ట్ చేయాలా? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఒక బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రి హోదాలో ఉండి.. హుందాగా వ్యవహరించాల్సిన అవసరం సంజయ్‌పై ఉందన్నారు. ఈ విషయంలో రాజకీయం చేయడం కంటే చట్టం ముందు వాస్తవాలను తేల్చుకోవాలని రేవంత్ సూచించారు.బండి సంజయ్ విచారణకు సహకరించాలని, ఆయన తన కొడుకును తీసుకుని స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వస్తేనే ఆయనకు గౌరవం ఉంటుందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. విచారణను ఎదుర్కోకుండా ఉండటం సరైన పద్ధతి కాదని ఆయన హితవు పలికారు.

# కుమారుడిని బండి సంజయ్ అప్పగించాలి





బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న సంగతి తెలిసిందే.. ఈ క్రమంలో మే 15న ఓ మీడియా నిర్వహించిన కాన్క్లేవ్‌లో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి ఈ కేసుపై కీలక వ్యాఖ్యలు చేశారు.

కొడుకు మీద కేసు నమోదైతే బండి సంజయ్‌ను అరెస్ట్ చేయాలా? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఒక బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రి హోదాలో ఉండి.. హుందాగా వ్యవహరించాల్సిన అవసరం సంజయ్‌పై ఉందన్నారు. ఈ విషయంలో రాజకీయం చేయడం కంటే చట్టం ముందు వాస్తవాలను తేల్చుకోవాలని రేవంత్ సూచించారు.బండి సంజయ్ విచారణకు సహకరించాలని, ఆయన తన కొడుకును తీసుకుని స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వస్తేనే ఆయనకు గౌరవం ఉంటుందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. విచారణను ఎదుర్కోకుండా ఉండటం సరైన పద్ధతి కాదని ఆయన హితవు పలికారు.మే 8వ తేదీ రాత్రి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారని రేవంత్ రెడ్డి వెల్లడించారు. 9వ తేదీనే విచారణ ప్రారంభించి, సెక్షన్లు మార్చి కేసు నమోదు చేశామని.. 11వ తేదీన నోటీసులు జారీ చేశామని తెలిపారు. ప్రధాని మోదీ పర్యటన భద్రతలో 10 వేల మంది పోలీసులు బిజీగా ఉన్నప్పటికీ.. కేసు విచారణలో ఎక్కడా జాప్యం జరగలేదని ఆయన గుర్తు చేశారు. తొందరపడి వెయ్యి మంది పోలీసులతో వెళ్లి ఇంటిపై పడితే.. కక్ష సాధింపు అని విమర్శలు చేసేవారు. అందుకే చట్టప్రకారం, నిశితంగా ఆధారాలు సేకరిస్తున్నాం అని రేవంత్ అన్నారు. సినిమా వాళ్లైనా, రాజకీయ నాయకులైనా తనకు ఎవరూ మినహాయింపు కాదని.. కేసు పెట్టినప్పుడే తన కమిట్‌మెంట్ ఏంటో అర్థం చేసుకోవాలని ప్రత్యర్థులకు చురకలు అంటించారు.

బండి సంజయ్ తీరు నైతికంగా తప్పని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కొడుకు చేసిన తప్పిదం వల్ల తలవంపులు వచ్చినా.. ధైర్యంగా నిలబడి విచారణను ఎదుర్కోవాలని సూచించారు. కొడుకును తీసుకువచ్చి పోలీసులకు అప్పగించాలి. స్టేషన్‌కు వచ్చి సమాధానం చెప్పాలి తప్ప పారిపోవద్దు. నోటీసులకు స్పందించకపోతే పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారు అని హెచ్చరించారు.బాధిత అమ్మాయికి సంబంధించి రెండు బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయని.. వాటన్నింటినీ పోలీసులు లోతుగా విచారించాల్సి ఉందన్నారు. నాలుగు నెలల క్రితం జరిగిన ఘటన కాబట్టి ఆధారాల సేకరణకు సమయం పడుతుందని.. ఒక్క రోజు ఆలస్యమైనా సరే తప్పు చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. బాధితులకు తమ ప్రభుత్వం 100 శాతం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై నేరాలను నియంత్రించడంలో మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ముఖ్యంగా పోక్సో కేసుల విషయంలో వెనక్కి తగ్గేదే లేదు అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# బండి సంజయ్ తల్లి శకుంతలకు గుండెపోటు

### హుటాహుటీన కరీంనగర్ నుంచి హైదరాబాద్ తరలింపు

### గచ్చిబౌలిలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స

### స్టంట్ వేసి ఐసీయూలో చికిత్స అందిస్తున్న వైద్యులు

కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తల్లి శకుంతల గుండెపోటుకు గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. ఆమెను గచ్చిబౌలిలోని మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించారు. శకుంతల గుండెకు వైద్యులు స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆమె ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.బండి సంజయ్ కూడా మెడికవర్ ఆసుపత్రికి చేరుకున్నారు. తల్లి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. శకుంతలకు గుండెపోటు రావడంతో బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా బండి భగీరథ్ పోక్సో కేసు మీడియాలో, సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.




# ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు, కానీ!: కవిత ఆసక్తికర వ్యాఖ్య

### కేసీఆర్ సీఎం అయ్యాక ప్రజలకు దూరమయ్యారన్న కవిత

### పరిపాలన కాలంలో కేసీఆర్ యంత్రంలా పని చేశారని వ్యాఖ్య

### అందుకే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదన్న కవిత



ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప వ్యక్తి అని, అందులో ఎవరికీ అనుమానాలు లేవని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు క్రమంగా దూరమయ్యారని అన్నారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పరిపాలన కాలంలో కేసీఆర్ ఒక యంత్రంలా మాత్రమే పనిచేశారని అన్నారు. అందువల్లే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదని విమర్శించారు.బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన ఎంతో కఠినంగా ఉండేవారని అన్నారు. కన్నబిడ్డగా సమస్యలు చెప్పుకునే అవకాశం తనకే ఇవ్వలేదని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకే అందుబాటులో లేని వ్యక్తి, ఇక సామాన్య ప్రజల కష్టాలను ఎలా వింటారని ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యమ నాయకుడి నుంచి ఒక యంత్రం లాంటి ముఖ్యమంత్రిగా మారిన తీరే ప్రస్తుత రాజకీయ పరిణామాలకు కారణమని అన్నారు.

# మెట్రోలో సాధారణ ప్రయాణికుడిలా తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు



బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు హైదరాబాద్ మెట్రోలో సాధారణ ప్రయాణికుడిలా ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ప్రజా రవాణా వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఆయన తార్నాక నుంచి జూబ్లీహిల్స్ వరకు మెట్రోలో ప్రయాణించారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కోరారు. వ్యక్తిగత కార్ల వాడకాన్ని తగ్గించి, మెట్రో, బస్సుల వంటి ప్రజా రవాణా వ్యవస్థలను ఉపయోగించడం ద్వారా దేశంపై పడే ఆర్థిక భారాన్ని (ఇంధన దిగుమతులు) తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించవచ్చని తెలిపారు.మెట్రోలో ప్రయాణికులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఆయన, ప్రధాని మోదీ 'బాధ్యతాయుత జీవన విధానం' గురించి వివరించారు. అలాగే 'వోకల్ ఫర్ లోకల్' నినాదంలో భాగంగా స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "దేశం కోసం.. భవిష్యత్తు కోసం.. మనందరి బాధ్యత" అనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు.

# బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారు




తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో దశ ఎస్ఐఆర్ నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో, శుక్రవారం కాంగ్రెస్ ప్రతినిధి బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... గత ఎన్నికల్లో పారదర్శకత లోపించిందని, బెంగాల్ ఎన్నికలే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి 'దొంగ ఓట్ల' సహాయంతోనే గెలిచారని ఘాటుగా ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికలు లేనందున, ఈ సవరణ ప్రక్రియను తొందరపాటుతో కాకుండా ఏడాది పొడవునా పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**వినతిపత్రంలోని ప్రధాన సూచనలు:**

గత 25 ఏళ్లలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగినందున, ఈ ప్రక్రియను ఒకటిన్నర సంవత్సరం నుంచి నుంచి 2 ఏళ్ల పాటు దశలవారీగా చేపట్టాలి. బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ) జియో-ట్యాగ్ ఫొటోలతో కనీసం మూడుసార్లు గృహ సందర్శన చేసి భౌతిక ధృవీకరణ చేయాలి.

ఓటును తొలగించే ముందు ఏడు రోజుల ముందస్తు రాతపూర్వక నోటీసు తప్పనిసరిగా ఇవ్వాలి. అభ్యంతరాల స్వీకరణకు కనీసం నెల రోజులు గడువు ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.రాజకీయ పార్టీలకు 2002 మరియు 2025 నాటి ఓటర్ల జాబితాల సాఫ్ట్ మరియు హార్డ్ కాపీలను అందించాలి. అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ జాబితాలను సకాలంలో పార్టీలకు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 2002 తర్వాత రాష్ట్రానికి వలస వచ్చి, కనీసం రెండుసార్లు ఓటు వేసిన వారికి అఫిడవిట్ ప్రాతిపదికన ఓటు హక్కు కల్పించాలి.జనాభా గణన, ఎస్ఐఆర్ విధులను వేర్వేరు అధికారులు నిర్వహించాలి. ఒకే అధికారికి రెండు బాధ్యతలు అప్పగించకూడదని కాంగ్రెస్ నేతలు కోరారు

# రోడ్డు పక్కన వాహనాలు పార్క్ చేస్తున్నారా.. బీకేర్‌ఫుల్, తెలంగాణలో కొత్త రూల్స్!

తెలంగాణలో వాహనాల పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. రోడ్లపై అడ్డగోలుగా వాహనాలు నిలపడం, రోజుల తరబడి వదిలేయడం వంటి చర్యలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ కొత్త పార్కింగ్ పాలసీ ముసాయిదాను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రూపుదిద్దుకున్న ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, వాహనదారుల జేబుకు చిల్లు పడటమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వాహనాన్ని కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. ఈ ముసాయిదాలోని నిబంధనల ప్రకారం ఇకపై ఎక్కడపడితే అక్కడ వాహనాన్ని పార్క్ చేస్తే కేవలం జరిమానాతో వదిలిపెట్టరు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా, ఫుట్‌పాత్‌లపై, నో పార్కింగ్ జోన్లలో ఉన్న వాహనాలను అధికారులు వెంటనే టోయింగ్ చేసి స్వాధీనం చేసుకుంటారు. వాహన యజమాని తన బండిని తిరిగి పొందాలంటే టోయింగ్ ఛార్జీలు, వాహనాన్ని యార్డులో ఉంచినన్ని రోజులకు రోజువారీ పార్కింగ్ ఫీజు చెల్లించాలి. అంతేగాక ఆ వాహనంపై ఉన్న పెండింగ్ చలాన్లు, ఇతర జరిమానాలు మొత్తం చెల్లించిన తర్వాతే వాహనాన్ని అప్పగిస్తారు. ఈ కొత్త విధానంలో అత్యంత కీలకమైన అంశం వాహనాల వేలం. అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాన్ని నెల నుంచి 45 రోజుల్లోగా యజమాని క్లెయిమ్ చేసుకోకపోతే, ఆ వాహనాన్ని ప్రభుత్వపరం చేసి బహిరంగ వేలం వేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఇలా స్వాధీనం చేసుకున్న వాహనాలను భద్రపరిచేందుకు పీపీపీ పద్ధతిలో ప్రత్యేక పార్కింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని కూడా రవాణా శాఖ ప్రతిపాదించింది. నిర్బంధించిన వాహనాలకు విధించే రోజువారీ పార్కింగ్ ఫీజులను కూడా ముసాయిదాలో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రాంతాలను బట్టి ఈ ఛార్జీలు మారతాయి. ద్విచక్ర వాహనానికి రోజుకు రూ.20 నుంచి రూ.30, ఆటోకు రూ.35 నుంచి రూ.50, కారుకు రూ.60 నుంచి రూ.80, బస్సు లేదా లారీకి రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేయాలని ప్రతిపాదించారు. ఎవరైనా వాహనాలను రోడ్లపై వదిలేసి వెళితే గతంలో జరిమానా విధించేవారు.. ఇకపై అలా కాదు జరిమానాలతో పాటుగా వాహనాన్ని స్వాధీనం చేసుకుంటారు. టోయింగ్ ఛార్జీలను కూడా వాహన యజమాని చెల్లించాల్సి ఉంటుంది.. అంతేకాదు ఆ వాహనాన్ని పోలీసుల దగ్గర ఉంచిన అన్ని రోజులకు పార్కింగ్ ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ వాహనంపై ఏవైనా పెండింగ్ చలాన్లు ఉన్నా ఇతర డాక్యుమెంట్లకు సంబంధించి ఏవైనా జరిమానాలు ఉన్నా చెల్లించాల్సిందే. ఒకవేళ వాహన యజమాని నెల నుంచి 45 రోజుల్లో క్లెయిమ్ చేయకపోతే ఆ వాహనాన్ని వేలానికి పంపే అవకాశం ఉంటుంది. వాహనాలు ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన సమయంలో, బ్రేక్‌డౌన్ అయిన సందర్భంలో.. ఫుట్‌పాత్‌లపై, నో పార్కింగ్ జోన్లలో వాహనాల్ని టోయింగ్ చేయాలని రవాణాశాఖ ముసాయిదాలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ వాహనాలు టోయింగ్, పార్కింగ్ ఫీజులకు సంబంధించి కూడా రవాణాశాఖ ఛార్జీలను ప్రతిపాదించింది. నగరాలు, గ్రామీణ ప్రాంతాల వారీగా ఈ ఛార్జీలు వేర్వేరుగా ఉన్నాయి. ఈ వాణాలను పార్క్ చేసేందుకు కొత్తగా పీపీపీ (ప్రభుత్వ ప్రైవేట్) భాగస్వామ్యంలో పార్కింగ్ యార్డులుఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించారు. ఈ వాహనాలకు నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాలను బట్టి రోజువారి పార్కింగ్ ఫీజులు నిర్ణయించిన్లు తెలుస్తోంది. బైక్‌లకు రోజుకు రూ.20 నుంచి 30, ఆటోలకు రూ.35 నుంచి 50, కార్లకు రూ.60 నుంచి 80, బస్సులకు రూ.200 నుంచి రూ.300 రోజుకు చెల్లించాలని ముసాయిదాల రవాణాశాఖ ప్రతిపాదించింది. ప్రస్తుతం ముసాయిదా దశలో ఉన్న ఈ పాలసీని ప్రభుత్వం ఆమోదించిన తర్వాత ప్రజల నుంచి సూచనలు, అభ్యంతరాలు స్వీకరించి తుది మార్పులతో అమలు చేయనుంది.

# వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కార్పొరేషన్లకు ఔటర్ రింగ్ రోడ్డు

తెలంగాణలో కొత్తగా మరికొన్ని నగరాలకు ఔటర్ రింగ్ రోడ్డులు రాబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు ఇతర ప్రాంతాలకు సంబంధించి మెగా గ్రోత్ కారిడార్‌ల్లో ఏకరీతి అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ కార్పొరేషన్లకు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంపై మున్సిపల్‌శాఖకు సూచించారు. రాష్ట్రంలో మెగా గ్రోత్ కారిడార్ల అభివృద్ధి, వాటి ప్రణాళికలపై ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణలోని ప్రతిపాదిత మెగా గ్రోత్ కారిడార్ల అభివృద్ధి ప్రణాళికలపై అధికారులకు పలు సూచనలు చేశారు.'మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్లను కలుపుతూ గ్రోత్ కారిడార్ ఏర్పాటు ప్రణాళికలు రూపొందించాలి. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ కలిపి గ్రోత్ కారిడార్ ఏర్పాటు చేయాలి. నల్గొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్‌ను, ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్ ఏర్పాటు కావాలి. కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అలంపూర్ జోగులాంబ ఆలయ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి. సింగరేణి పరిధిలో ఉన్న అన్ని మున్సిపాలిటీలను ఒక యూనిట్‌గా అభివృద్ధి చేయాలి. సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చు చేయాలి. ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, రింగ్ రోడ్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలతో పాటు ఇతర అంశాలన్నీ గ్రోత్ కారిడార్లలో స్పష్టంగా ఉండాలి' అని రేవంత్ రెడ్డి సూచించారు.'తెలంగాణలో రాబోయే విమానాశ్రయాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి ప్రణాళికలు, పనులు చేపట్టాలి. వరంగల్ విమానాశ్రయం ఏర్పాటుతో ఆ ప్రాంతం రూపురేఖలు పూర్తిగా మారుతాయి. ఆ విమానాశ్రయానికి కావలసిన నీటి అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్‌ను రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోతుంది. గ్రోత్ కారిడార్లలో వచ్చే 25 ఏళ్లకు సరిపోయేలా ప్రతిదీ డిజైన్ చేయాలని స్పష్టంగా ఉండాలి. నగరాల్లో ఖర్చును తగ్గించుకోవడానికి ఈవీ వాహనాలను ప్రవేశపెట్టాలి. లీజుకు తీసుకునే వాహనాలు కూడా ఈవీ వాహనాలే ఉండాలి. ప్రతి చోట పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా ప్రణాళికలు ఉండాలి' అన్నారు.'మున్సిపాలిటీలలో సోలార్ విద్యుత్ ప్లాంట్లను నిర్మించాలి. ప్రధానంగా నగరాలు, పట్టణాల్లో రేడియేషన్ తగ్గించడానికి మల్టీ యుటిలిటీ టవర్స్ ఏర్పాటు చేయాలి. నగరాలు, పట్టణాల్లో సమస్యలను పరిష్కరించడానికి ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ఏఐ వినియోగం కోసం సాంకేతిక నిపుణుల సలహాలు తీసుకోవాలి. భూగర్భ డ్రైనేజీ, స్మార్ట్ పోల్స్, రోడ్లు, ఎస్టీపీలు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, ఈవీ వంటి అంశాల పైన ప్రతి చోట ఒకే విధమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలి' అని ముఖ్యమంత్రి సూచించారు

# గులాబీ జోరు అందుకుంటుందా..

తెలంగాణాకు మోడీ వచ్చి సగం రోజు అక్కడే ఉండి చేసిన రాజకీయ కలకలం అంతా ఇంతా కాదు, సీఎం రేవంత్ రెడ్డిని తమతో కలవమని బంపర్ ఆఫర్ ఇచ్చారు. దాంతో ఎవరికి తోచిన విధంగా వారు దీని

మీద విశ్లేషించి రచ్చ చేశారు. ఇక రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్డీయే బలోపేతం మీద మోడీ మిత్రులతో చర్చించారు అన్న వార్తలతో అటు ఆంధ్రాలో వైసీపీ ఇటు తెలంగాణాలో బీఆర్ఎస్ కూడా ఉలిక్కిపడి ఫ్యూచర్ కోర్స్ ఆఫ్ యాక్షన్ లోకి దిగిపోతున్నాయి. కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ లో తాజాగా బీఆర్ఎస్ సీనియర్లతో అతి ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నడూ లేని విధంగా ఏకంగా ఆరు గంటల సేపు ఈ మీటింగ్ సాగింది అని అంటున్నారు. ఈ మీటింగ్ వేరీ సీరియస్ గానే సాగింది అని అంటున్నారు. ఏకంగా బీఆర్ఎస్ ని గ్రౌండ్ నుంచి టాప్ లెవెల్ వరకూ కొత్త రూపుతో షేపుతో తీర్చిదిద్దాలని కేసీఆర్ పార్టీ వర్గాలకు దిశా నిర్దేశం చేశారని అంటున్నారు బీఆర్ఎస్ విషయంలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు చేపట్టాలని కూడా డిసైడ్ అయినట్లుగా తెలుస్తోంది. అలాగే బీఆర్ఎస్ భవిష్యత్తు కార్యాచరణపై కూడా లోతైన చర్చ సాగింది అని అంటున్నారు. బీఆర్ఎస్ ని పూర్తిగా గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అధినాయకుడు కేసీఆర్ పార్టీ వర్గాలకు సూచించారు అని అంటున్నారు. గతానికి భిన్నంగా తెలంగాణా రాజకీయం మారుతోంది అని బీఆర్ఎస్ పెద్దలు గుర్తించారు. బీజేపీ తెలంగాణాలో అధికారం విషయంలో గట్టి పట్టుదలతో ఉందని కూడా అర్థం అవుతోంది. మోడీ బహిరంగ సభలో అయితే వచ్చేది బీజేపీనే అని స్ట్రాంగ్ స్టేట్మెంట్ ఇచ్చారు. బీజేపీ కనుక ఒక చోట అధికారంలోకి రావాలనుకుంటే దానికి సంబంధించి గ్రౌండ్ వర్క్ చాలా ముందుగానే రెడీ చేసి పెట్టుకుంటుంది. దానికి తాజా ఉదాహరణ పశ్చిమ బెంగాల్ లో ఆ పార్టీ ఘన విజయం. అసలు ఓటమి లేదు అనుకున్న మమతా బెనర్జీ ఓటమి పాలు అయ్యారు. దాంతో అంతకంటే బలమైన ప్రాంతీయ పార్టీల నేతలు ఎవరూ లేరని అంటున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ కూడా పూర్తి స్థాయిలో అలెర్ట్ అవుతోంది అని అంటున్నారు ఇక బీఆర్ఎస్ ని బూత్ లెవెల్ నుంచి గ్రామ వార్డు స్థాయి నుంచి కమిటీలతో నింపాలని నిర్ణయించారు. అలాగే నియోజకవర్గం స్థాయి జిల్లా స్థాయి వరకూ కూడా బలమైన సమర్థులైన నాయకులతో పార్టీని పటిష్టం చేయాలని కూడా నిర్ణయించారు ఇక పార్టీ శ్రేణులలో సరికొత్త ఉత్సాహం నింపాలని రానున్న రోజులలో నేతలంతా జనంలో ఉంటూ బీఆర్ఎస్ ని పరుగులు పెట్టించాలని కూడా తీర్మానించారని అంటున్నారు. జీహెచ్ఎంసీ సహా ఏ ఎన్నికలు జరిగినా విజయమే పరమాధిగా పార్టీ పోరాడాలని కూడా నిర్ణయించారు. మొత్తానికి 2028 ఎన్నికలకు బీజేపీ రెడీ అని మోడీ గట్టిగా చెప్పి వెళ్లారు. దాంతో బీఆర్ఎస్ కూడా జోరు చేస్తోంది అని అంటున్నారు. చూడాలి మరి రానున్న రోజులలో బీఆర్ఎస్ స్పీడ్ ఏ విధంగా ఉంటుందో.

# నాంపల్లి రైల్వే స్టేషన్ లో అగ్ని ప్రమాదం.. జైపూర్ ఎక్స్‌ప్రెస్ బోగిలో చెలరేగిన మంటలు



నాంపల్లి రైల్వేస్టేషన్ లో శుక్రవారం (మే15) సాయంత్రం భారీ అగ్నిప్రమాదం జరిగింది. స్టేషన్ లో ఆగివున్న హైదరాబాద్ - జైపూర్ స్పెషల్ ట్రైన్ బోగీల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఏసీ కోచ్ దీ2 బోగిలో చెలరేగిన మంటలు క్షణాల్లో ఇతర బోగీలకు వ్యాపించాయి. దీంతో ప్రయాణికులు భయంతో పరుగులు పెట్టారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలార్పారు. ఘటన జరిగినప్పుడు బోగీలలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో హైదరాబాద్ నుంచి జైపూర్ కు వెళ్లేందుకు ప్లాట్ ఫాం పై వేచి ఉందని అధికారులు తెలిపారు.

# ఘనంగా జాతీయ టెక్నాలజీ డే

**ఈ-ట్రాక్టర్, ఈ-టిల్లర్ పై నేషన్వైడ్ రోడ్షో**

హైదరాబాద్ లోని సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ) లో జాతీయ టెక్నాలజీ డే వేడుకలతో పాటు ఈ-ట్రాక్టర్, ఈ-టిల్లర్ పై నేషన్వైడ్ రోడ్షోను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎస్ఐఆర్-ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస రెడ్డి హాజరై ప్రసంగించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం ద్వారా రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనం అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. సీఎస్ఐఆర్-సీఎంఈఆర్ఐ అభివృద్ధి చేసిన ఈ విద్యుత్ ఆధారిత ఈ-ట్రాక్టర్, ఈ-టిల్లర్ యంత్రాలు చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. డీజిల్ ఆధారిత యంత్రాలకు ప్రత్యామ్నాయంగా రూపొందించిన ఈ పరికరాలు తక్కువ నిర్వహణ ఖర్చు, సులభ వినియోగం, పర్యావరణ హిత పనితీరు వంటిప్రత్యేకతలను కలిగి ఉన్నాయని వివరించారు. మహిళా రైతులు కూడా సులభంగా వినియోగించుకునేలా ప్రత్యేక డిజైన్తో రూపొందించినట్లు వెల్లడించారు. సుస్థిర వ్యవసాయం, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ రోడ్షో ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఈ యంత్రాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించి ఆసక్తి వ్యక్తం చేశారు. రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, విధాన నిర్ణేతలు సహా 150 మందికి పైగా ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

# నిర్మాతలు వర్సెస్ ఎగ్జిబిటర్లు

రామ్ చరణ్ 'పెద్ది' సినిమా విడుదలకు ముందు టాలీవుడ్‌లో నిర్మాతలు వర్సెస్ ఎగ్జిబిటర్లు అన్నట్లుగా మారింది. ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ నిన్న కీలక నిర్ణయం తీసుకుంది. సింగిల్ స్క్రీన్‌లలో పర్సంటెజీ విధానానికి అంగీకరించిన నిర్మాతల సినిమాలనే ప్రదర్శిస్తామని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ నిర్ణయంపై యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ బుధవారం మీడియా సమావేశం నిర్వహించింది. రవిశంకర్ యలమంచిలి, నాగవంశీ, సాహు గారపాటి, సతీష్ కిలారు తదితరులు ప్రెస్ మీట్‌లో పాల్గొన్నారు. చిత్ర పరిశ్రమలో ఎగ్జిబిటర్లతో పాటు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. మూడు సెక్టార్లు కూర్చుని మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకోవాలని అన్నారు. రవిశంకర్ మాట్లాడుతూ, తాము ఎవరికీ వ్యతిరేకం కాదని అన్నారు. సినిమా అనేది ఏ ఒక్కరి కష్టం కాదని పేర్కొన్నారు. చిత్ర పరిశ్రమలో ఒక ఎకో సిస్టమ్ ఉందని తెలిపారు. ఎగ్జిబిటర్ల ఇబ్బందులను తాము అర్థం చేసుకుంటామని అన్నారు. అయితే పరిశ్రమలో అందరూ కలిసి మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎగ్జిబిటర్ వ్యవస్థలో మార్పు రావాలని, కానీ ఇప్పటికిప్పుడు మార్పు రావాలంటే కష్టమని అన్నారు. హరిహర వీరమల్లు విడుదల సమయంలో పర్సంటేజీ విధానం బయటకు వచ్చిందని, ఆ తర్వాత మరెన్నో సినిమాలు విడుదలయ్యాయని అన్నారు. ఇప్పుడు పెద్ది సినిమా విడుదల అవుతున్న సందర్భంగా బ్లాక్‌మెయిల్ చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. పర్సంటేజీ విధానాన్ని అమలు చేసే సినిమాలనే ప్రదర్శిస్తామని ఎగ్జిబిటర్లు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరైన విధానం కాదని నాగవంశీ అన్నారు. ఎగ్జిబిటర్లు అడుగుతున్న పర్సంటేజీని తాము ఇవ్వలేమని అన్నారు. మల్టీప్లెక్స్‌లు ఉన్న ఒక ఎగ్జిబిటర్ సింగిల్ స్క్రీన్ కష్టాల గురించి మాట్లాడటం, అలాగే పర్సంటేజీ ప్రకటించిన 23 థియేటర్లు లీజులోనే ఉండటం హాస్యాస్పదమని అన్నారు. ఇప్పుడు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో బాల్కనీ టికెట్ రేటు 200 లోపే ఉంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే... 175 రూపాయలు. ఆన్ లైన్ టికెటింగ్ యాప్స్ అయిన పేటీఎమ్, బుక్ మై షోలో బుక్ చేస్తే 200 అవుతుంది. బాల్కనీ తర్వాత వంద రూపాయలు, నేల టికెట్టు 50 రూపాయలు ఉంది. సినిమా విడుదలైనప్పటి నుంచి మొదటి వారం లేదా పది రోజులు టికెట్ రేట్లు పెంచుకోవడానికి అనుమతి లభిస్తే ఆ రేటు 200 నుంచి 400 లేదా 500 వరకు వెళు తోంది. బెనిఫిట్ షో రేట్లు అయితే 1000 నుంచి 2000 వరకు ఉంటున్నాయి. ఇప్పుడు టికెట్ రేట్లు పెంచమని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ స్పష్టంగా చెప్పడం వల్ల మొదటగా నష్టపోయే సినిమా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది'యే. జూన్ 4న 'పెద్ది' విడుదల అవుతోంది. సినిమాకు కావాల్సిన బజ్ ఆల్రెడీ విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలు తీసుకు వచ్చాయి. అభిమానులు, ప్రేక్షకులు కొందరు నాలుగు వందలు అయినా టికెట్ పెట్టి సినిమా మొదటి వారం సినిమా చూసేందుకు రెడీ. ఆల్రెడీ టికెట్ రేట్లు గురించి ప్రభుత్వంతో చిత్ర నిర్మాత వెంకట సతీష్ కిలారు మాట్లాడినట్టు తెలిసింది.

# అప్పుల పాలవుతున్న జీహెచ్ఎంసి

ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన జీహెచ్ఎంసీకి భరోసా కల్పించాల్సిన సర్కారు సంస్థ ఉనికిని ప్రశ్నార్థకం చేసింది. జీహెచ్ఎంసీని సైబరాబాద్ (సీఎంసీ), మల్కాజిగిరి (ఎంఎంసీ)గా విభజించిన సర్కారు..ఆస్తుల విభజన, అప్పులను సీజీజీ నేతృత్వంలో కమిటీ వేయగా.. దాదాపు రూ. 4,717 కోట్ల అప్పులను సర్కారు ఆదుకోవాలంటూ ప్రతిపాదనలు సమర్పించింది. ఈ నేపథ్యంలోనే అప్పులను టెకోవర్ చేసుకునేందుకు ససేమిరా అంటున్నది. ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) ద్వారా సర్దబాటు చేసుకోవాలంటూ ఉచిత సలహా ఇవ్వడం విశేషం..కాగా బల్దియా చేసిన వేల కోట్ల అప్పులను నేరుగా టేకోవర్ చేసేందుకు సాంకేతిక ఇబ్బందులు ఉన్న దృష్ట్యా, పన్ను బకాయిల రూపంలో నిధులను సర్దుబాటు చేసి సంస్థను బలోపేతం చేయాలని నిర్ణయించింది. తెలంగాణ వార్తలు ప్రభుత్వ భవనాల నుంచి రావాల్సిన భారీ బకాయిలను వన్ టైమ్ సెటిల్ మెంట్ ద్వారా చెల్లించడం.. అప్పుల భారాన్ని తగ్గించాలని ఇటీవల కేబినెట్ నిర్ణయం తీసుకున్నది. అయితే ఇప్పటి వరకు ఎ లాంటి అధికారిక జీవో వెలువడలేదు. ఈ తరుణంలోనే ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన ఆస్తి పన్నును ఓటీఎస్ ద్వారా సర్దుబాటు చేయడం ద్వారా మూడు కార్పొరేషన్లకు సుమారు రూ. 1,686 కోట్లు తక్షణమే అం

దుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు..మిగిలిన దాదాపు రూ.3వేల కోట్ల అప్పులు ఏడాది కాలంలో ఒక్క జీహెచ్ఎంసీతోనే ఎలా సాధ్యమవుతుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి జీహెచ్ఎంసీకి ఆరేండ్లుగా రావాల్సిన స్టాంపు డ్యూటీ రూ.3,030 కోట్లను గతేడాది జనవరి నెలలో రిలీజ్ చేసింది. మొత్తం రూ. 3,169 కోట్లు రావాల్సి ఉంది. ఇందులో స్టాంప్ డ్యూటీకి సంబంధించి రూ. 3030 కోట్లు, మ్యూటేషన్ ఫీజుల కింద రూ. 139 కోట్లు రావాల్సి ఉండగా, ఇందులో స్టాంప్ డ్యూటీ మొత్తాన్ని బల్ధి యా పర్సనల్ డిపాజిట్స్ (పీడీ) అకౌంట్‌లో జమ చేసింది. అయితే ఈ నిధులను రెవెన్యూ ఖర్చు కోసం మాత్రమే వినియోగించాలని నిబంధన పెట్టింది. డెవలప్‌మెంట్‌కు ఒకేసారి

వాడుకునేందుకు వీలులేకపోవడం, ఉద్యోగుల జీతాలు, మెయింటనెన్స్ లోన్ల రీ పేమెంట్స్ కోసం వినియోగించారు. మొత్తంగా రూ. 1000 కోట్లను మాత్రమే వినియోగించుకున్నారు. ఇంకా నెలవారీగా ఈ నిధులను రెవెన్యూ ఖర్చులకు వినియోగించుకోవాలని అధికారులు భావిస్తున్న తరుణంలో, కుడి చేత్తో ఇచ్చి ఎడమ చేత్తో తీసుకున్నట్లుగా సర్కారు బల్ధియా ఈ నిధులను వెనక్కి తీసుకున్న కోలుకోని షాక్‌కు గురి చేసింది. ఉన్న ఫళం గా రూ. 2వేల కోట్లకు పైగా లాగేసుకుని కనీసం ఆ ప్రస్తావన తీసుకురాకపోవడంపై తీవ్రంగా మండిపడుతున్నారు. జీహెచ్ ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విడగొట్టి, ఒకో దానికి రూ. 500 కోట్లు ఇస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు..ఆ హామీని గాలికి వదిలేశారు. స్పెషల్ ఆఫీసర్ జయేశ్ రంజన్ ప్రతి కార్పొరేషన్‌కు రూ. 500కోట్ల మేర నిర్వహణ ఖర్చులకు ఇస్తామని ప్రకటించారు. కానీ బడ్జెట్‌లో కనీసం నయా పైసా కేటాయింపులు జరపలేదు. ఫలితంగా నగర శివారులోని 27 పురపాలికలను జీహెచ్ఎంసీలో కలపడం ద్వారా ఆ ప్రాంతాల రూపురేఖలు మారిపోతాయన్న ఆశలు ఆవిరైపోయాయి. విలీనం ముందు బడంగ్‌పేట, నార్సింగి, మణికొండ

పురపాలికలు ప్రతి ఏటా రూ.200కోట్ల మేర సర్‌ప్లస్‌లో బడ్జెట్ ఉండేదని, ఇప్పుడు మౌలిక వసతుల కల్పనపై తీవ్ర ప్రభావం పడుతుందని స్థానికులు మండిపడుతున్నారు.

# పేదల ముఖంలో చిరునవ్వు చూడడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం.



**న్యూస్ ఇండియా:దుగ్గొండి :**ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల సహకారం అవుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో లబ్ధిదారులు సొంతంగా ఇళ్లను నిర్మించుకునే వెసులుబాటు కల్పిస్తూ సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు, దుగ్గొండి మండలం బిక్కజిపల్లి గ్రామంలో సింగనబోయిన ఎర్ర ఓదేలు గృహప్రవేశా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ఆశీర్వదించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోకల శ్రీనివాస్ రెడ్డి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద, అర్హులైన పేద కుటుంబాల సొంతింటి కల నిజమవుతోంది. ఈ పథకం ద్వారా, సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికి గృహనిర్మాణం కోసం ?5 లక్షల ఆర్థిక సహాయాన్ని నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తోందని అలాగే మొదటి విడతలో రానివారికి రెండో విడత జూన్ 2 నుంచి మొదలవుతుందని అర్హులైన లబ్ధిదారులకు వెసులుబాటు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిక్కజిపల్లి సర్పంచ్ బండారి రమేష్ మాట్లాడుతూ గతంలో ఇందిరాగాంధీ మహిళా శక్తి గరీబ్ హటావో నినాదాలతో పేదలకు ఇల్లు స్థలాలు అందించిన సంగతి తెలిసిందే 2009లో ఒక లక్ష తో ప్రారంభమైన ఈ పథకాన్ని కొనసాగిస్తూ ప్రస్తుతం ఆరు హామీల్లో భాగంగా ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం స్వీకారం చుట్టిందని కొనియాడారు. అలాగే లబ్ధిదారులకు చైనా గోడ గడియారం బహూకరణ చేసిన సర్పంచ్ బండారి రమేష్.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కొలువురు సుమంత్, బండారి ప్రకాష్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాక్స్ డ్రైనేజీ పనుల కొరకు నిధులను సాంక్షన్ చేయించిన మైనంపల్లి హనుమంతరావు



**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 15 ( మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టీ నరేష్ )**మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావ్ సహకారంతో హనుమాన్ నగర్ 2వ బస్ స్టాప్ వద్ద జరుగుతున్న బాక్స్ డ్రైనేజ్ పెండింగ్ పనుల కొరకు మరల ప్రత్యేకంగా అధికారులతో మాట్లాడి రూ.32 లక్షలు సాంక్షన్ చేయించడం జరిగింది.ఇదే పనుల కొరకు ఇంతకుముందు కూడా మైనంపల్లి హనుమంతరావు రూ.96 లక్షలు సాంక్షన్ చేయించడం తెలిసిందే. ఈ పనులను పర్యవేక్షించడానికి 186 డివిజన్ ప్రెసిడెంట్ పోతుల వినోద్ యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న,ఉస్మాన్ భాయ్, మల్లేష్, పాండురంగ చారి,షకిల్ భీమ్ రాజ్ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్ లక్ష్మణ్ నాని అభిలాష్ సాగర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం మరియు ఈస్ట్ హనుమాన్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ నరసింహ ముదిరాజ్ నాగేందర్ రెడ్డి రాజు బాల్నర్సిమా సుబ్బు జగదీష్ భాను అలాగే స్థానిక ప్రజలు ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## సఫిల్‌గూడ రైల్వే స్టేషన్ సమీపంలో ఎల్‌హెచ్‌ఎస్ పనుల పరిశీలన

పరిశీలించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 15 ( మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టి నరేష్ )**మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సఫిల్‌గూడ రైల్వే స్టేషన్ సమీపంలో కొనసాగుతున్న ఎల్‌హెచ్‌ఎస్ (లిమిటెడ్ హయిట్ సబ్వే ) నిర్మాణ పనులను స్థానిక నాయకులు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో పాటు వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, హేమంత్ పటేల్, స్థానిక కాలనీవాసులు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# చెరువులు కుంటలు కబ్జాలకు గురై కనుమరుగవుతుంటే అధికారులు పట్టించుకోరా......



**కుత్బుల్లాపూర్ మే15 (న్యూస్ ఇండియా ప్రతినిధి)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్ పల్లి డివిజన్ పరిధిలోని బొబ్బ ఖాన్ చెరువు, సందయ్య కుంట , ఫిర్జాది కుంట నేరెళ్ల కుంట, ( మల్లన్న కుంట) క్రమముగా కబ్జాల గురై కనుమరుగవుతున్నాయని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోరా?
చెరువులు కుంటలు కబ్జాకు గురి కావడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది..
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు భవిష్యత్తు తరాలకు చెరువులు కుంటలు నాలాలను కబ్జాలకు గురికాకుండా వాటి పరిరక్షణ కోసం హైడ్రా వంటి సంస్థను ఏర్పాటు ఏర్పాటు చేయడం జరిగింది .. గత ప్రభుత్వం( బి ఆర్ ఎస్ )పార్టీ స్థానిక నాయకుల కనుసన్నల్లోనే చెరువులు కుంటలు కబ్జాలకు గురవుతున్నాయి దీనికి తోడు అధికారులు మాత్రం" డోంట్ కేర్ అంటూ వ్యవహరిస్తున్నారు.
చెరువులు కుంటలు కాపాడాల్సిన ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు మౌనం ఎందుకు వహిస్తున్నారు..? గత వర్షాకాలంలో అధికారుల నిర్లక్ష్యం వల్లనే చాలా కాలనీలు ముంపుకు గురయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులు కుంటల్లో నిర్మించినటువంటి అక్రమ నిర్మాణాలను తొలగించి వాటిని పునరుద్ధరించాలని కబ్జాల్లో ఉన్నటువంటి కుంటలను కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం.

# అంధకార స్థితిలోకి ప్రజలను నెట్టివేసిన బీజేపి ప్రభుత్వం

- పెట్రో ధరల పెంపుపై ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కార్యదర్శి షేక్ షావలి
- పెంచిన ధరలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్.



**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 15 ( మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టి నరేష్ )** కేంద్రంలోని ఎన్.డి.ఏ. బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన పెట్రో పెంపు ధరలను వెంటనే రద్దు చేయాలని ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కార్యదర్శి షేక్ షావలి డిమాండ్ చేశారు. 2026, మే-15 వ తేదీన జారీచేసిన పత్రిక ప్రకటనలో 147 కోట్లమంది భారతదేశ ప్రజలను అంధకారంలోకి నెట్టివేసే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు దుర్మార్గమైన, అమానుష ప్రజా వ్యతిరేక మైన చర్య అని ఎండగట్టారు. పశ్చిమాశియా దేశాలలో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో ఏర్పడిన సంక్షోభం వలన ఆయిల్ కంపెనీలు చేపట్టిన నిర్ణయంలో బాగమే పెట్రో ధరల పెంపు అని కేంద్ర ప్రభుత్వం అనడాన్ని తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ స్థాయిలో ఈరోజు ఆయిల్ చమురు సంక్షోభంలో పడడానికి అమేరికా డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ నేతాన్యాహు తోపాటు భారత ప్రదాని నరేంద్రమోదీ కూడ ఒకరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికా సామ్రాజ్యావాదానికి లొంగిపోయిన నరేంద్రమోదీ, దేశాన్ని మరో నయా వలస దేశంగా మార్చి, అన్నిరకాల అమెరికా దోపిడీకి సంభందించిన ఒప్పందాలు చేసుకొన్నాడని మండిపడ్డారు. దేశ సార్వభౌమాదికారాన్ని అమెరికా డోనాల్డ్ ట్రంప్ కు తాకట్టుపెట్టి, అన్నివర్గాల ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బశారని అన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిన వెంటనే ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు, విధానాలతో దేశ ప్రజలను ఇంకా త్యాగాలకు సిద్ధపడాలని చెప్పడం ఇంతకన్న సిగ్గుచేటు మరోకటి ఉండదని అన్నారు. అన్నిరంగాలు తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయి, అప్పుల దేశంగా మార్చేసి, అగమ్యగోచరంలోకి వివిధ శ్రామిక, మధ్యతరగతి ప్రజలను, ఉద్యోగస్థులను నెట్టివేసిందని అన్నారు. ఇప్పటికే ఏఐ వలన అనేక సాఫ్ట్వేర్ కంపేనీలలో పనిచేస్తున్న ఉద్యగులను ఇంటికి పింపిస్తున్నారని, ఇంకా కొందరి ఉద్యోగస్తులకు వారి ఉద్యోగ భద్రతా గాలిలో దీపంలా ఊగిసలాడుతున్నారని అన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఆత్మహత్యలు,అర్ధకాలి, పస్థులు,చాలిచాలని విద్య, ఉద్యోగం , ఉపాధి సౌకర్యాలు, వేతనాలు లేక తల్లడిల్లుతున్న ప్రజానీకంపై పెట్రో ధరల పెంపు మోయలేని పెనుబారం అని అని అన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యవసర ధరలతో ప్రజలు అల్లాడి పోతున్నారని అన్నారు. దీనికి తోడు పెట్రో ధరలతో ఇతర వస్తువుల ధరలు అమాంతం పెరిగి, ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తాయని గుర్తుచేశారు. వెంటనే దేశంలోని బీజేపీయేతర ప్రభుత్వాలు, ప్రజలు పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను బలంగా తిరస్కరించాలని కోరారు. తద్వారా ప్రశ్నార్ధకంగా మారుతున్న భారత రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కుతో పాటు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అన్నిరకాల అప్రజాస్వామిక మతతత్వ రాజకీయ విధానాల ఫాసిజం నుండి దేశాన్ని కాపాడుకోవల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా షేక్ షావలి వ్యాఖ్యానించారు.

# తొలి తెలుగు కవిత్రి మొల్లమాంబ విగ్రహ ప్రతిష్టాపన

- మహిళా విద్యాసాహిత్య రంగంలో తన జీవితం స్ఫూర్తిదాయకం
- మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్



**న్యూస్ ఇండియా :నర్సంపేట**

ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో తొలి తెలుగు సాహితీ చరిత్రలో అత్యంత ప్రసిద్ధి చెందిన ఆతుకూరి మొల్ల (మొల్లమాంబ) విగ్రహ ప్రతిష్టాపన శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్ చేతుల మీదుగా ప్రారంభించారు..ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ...తెలుగు భాషాభివృద్ధికి మొల్లమాంబ చేసిన సేవలు తరతరాలకు ఆదర్శమని అన్నారు. 550 సంవత్సరాల క్రితం శ్రీకృష్ణదేవరాయల కాలంలో మహిళలు విద్య, సాహిత్య రంగాల్లో ముందుకు రావడానికి మొల్లమాంబ జీవితం స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇంత గొప్ప కవిత్రి కుమ్మరి కులంలో జన్మించడం సంతోషతగా విషయం అని తెలియపరచారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు చిలువేరు కొమ్మాలు, కందికొండ తిరుపతి, చిలువేరు వెంకటేశ్వర్లు, కుమారస్వామి, కొమురయ్య, రాజహంస, చెల్పూరి రాజమౌళి, లింగాల విజయ్, రాజేందర్, పాలడుగుల కుమారస్వామి, పైడయ్య సారంగం కుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ లీగల్ అడ్వైజర్‌గా కల్లోజు జయరాజ్ నియామకం..



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, మే 15, న్యూస్ ఇండియా ప్రతినిధి:**ప్రముఖ హైకోర్టు న్యాయవాది కల్లోజు జయరాజ్‌ను మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ లీగల్ అడ్వైజర్‌గా నియమించినట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు చేపూరి శంకర్ తెలిపారు. ఈ మేరకు సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చేపూరి శంకర్, జయరాజ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చేపూరి శంకర్ మాట్లాడుతూ.. కల్లోజు జయరాజ్ గత కొన్ని సంవత్సరాలుగా సామాజిక, ప్రజా సమస్యలపై న్యాయపరంగా పోరాటం చేస్తూ ప్రజలకు సేవలందిస్తు న్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీకి లీగల్ అడ్వైజర్‌గా బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అనంతరం కల్లోజు జయరాజ్ మాట్లాడుతూ.. సొసైటీ ఆశయాలకు అనుగుణంగా న్యాయపరమైన సేవలు అందిస్తూ సంస్థకు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ సందీప్, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం




**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక ఏప్రిల్ 15 ( మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టి నరేష్)** కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీమతి బి. సుమతి ఐపీఎస్ మేడమ్ మరియు ట్రాఫిక్-1 డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. రాహుల్ రెడ్డి ఐపీఎస్ ఆదేశాల మేరకు,2026 మే15 శుక్రవారం రోజున ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తిరుమలగిరి పరిధిలోని బోయిన్పల్లి మార్కెట్లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో బోయిన్పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు, డ్రైవర్లు మరియు రైడర్లు పాల్గొన్నారు.కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ తిరుమలగిరి డివిజన్ జి. శంకర్ రాజు పాల్గొని వారికి ట్రాఫిక్ నియమాలు మరియు నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రతకు సంబంధించిన పలు అంశాలపై వివరించి, ముఖ్యంగా హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత,మైనర్లతో వాహనాలు నడపించకుండా ఉండడం, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సీట్ బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ను తప్పనిసరిగా పాటించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు మరియు ఇతర ట్రాఫిక్ ఉల్లంఘనల గురించి తెలియజేశారు. అలాగే రోడ్డు భద్రతపై అవగాహనతో పాటు బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో 30 సంవత్సరాలుగా ఎటువంటి ప్రమాదం లేదా ఘటన లేకుండా సురక్షితంగా ఆటో నడుపుతున్న ఆటో డ్రైవర్ రమణయ్య ని ఆయన సురక్షిత డ్రైవింగ్ సేవలను గుర్తించి ఘనంగా సన్మానించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తిరుమలగిరి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వి. సర్దార్ నాయక్, ఆర్ఐ ఐ.వి. రమణయ్య మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తిరుమలగిరి ఎస్ఐలు పాల్గొన్నారు

## 18 మే 2026 నుండి ధర్మవాన్ని కార్యక్రమం. నిర్వహించబడుతుంది

**వరంగల్ సిటీ బ్యూరో. న్యూస్ ఇండియా ప్రతినిధి . (రవీందర్)** దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్ వారి సూచనల మేరకు శ్రీయుత కమిషనర్ వారు ప్రతి సోమవారం తేదీ 18 మే నెల 2026 నుండి సహాయ కమిషనర్ వారి కార్యాలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జిల్లా నందు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు సహాయ కమిషనర్ వరంగల్ వారు "ధర్మ వాణి " కార్యక్రమం నిర్వహించబడును ఇట్టి "ధర్మవాని ". కార్యాలయంలో ప్రజలు/భక్తులు. మరియు శాఖకు సంబంధించిన అర్చక ఇతర ఉద్యోగులు తమ యొక్క సమస్యలు పరిష్కారానికై అవకాశాన్ని అందరూ సద్వినియోగించుకోగలరని అధికారులు కోరడమైనది

## వేలాంగిణి మేరీ మాత యాత్రకు బయలుదేరుతున్న క్రైస్తవ సోదరులకు జెండా ఊపిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ




**న్యూస్ ఇండియా** పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణం రఘురాం నగర్ కార్యాలయం నందు తమిళనాడు రాష్ట్రం ప్రముఖ పుణ్యక్షేత్రమైన నాగపట్నం వేలాంగిణి మేరీ మాత ను దర్శించుకోవడానికి సత్తెనపల్లి కి చెందిన క్రైస్తవ సోదరులు ప్రయాణిస్తున్న వాహనానికి జెండా ఊపి యాత్రను ప్రారంభించి , పూర్తి స్వయం సహకారాలు అందించిన తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు మరియు సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మి నారాయణ. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులు యాత్రను ఏర్పాటుచేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు మరియు శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ వార్డు నాయకులు పాల్గొన్నారు.

## ర్యాలి సచివాలయంలో కిశోరి వికాసం అవగాహన కార్యక్రమం

**ఆత్రేయపురం న్యూస్ ఇండియా:**ఆత్రేయపురం మండలం కొత్తపేట ప్రాజెక్టు పరిధిలోని ర్యాలి సచివాలయంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 1 మే 2026 నుండి మనేది వ లెరేఖ వరకు ప్రతి మంగళవారం, శుక్రవారం రోజుల్లో ప్రతి సచివాలయం పరిధిలో కిశోర బాలబాలికలకు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.
ఈ కార్యక్రమానికి సిడిపిఓ ఎ. గజలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కిశోర బాలబాలికలు విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. సమాజంలో పెరుగుతున్న బాల్య వివాహాలు, అక్రమ రవాణా వంటి సామాజిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బాలల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పోక్స్ చట్టం గురించి క్లుప్తంగా వివరించి, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.
కార్యక్రమంలో బాలబాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, విద్య ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు ధైర్యంగా ముందుకు సాగి తమ లక్ష్యాలను సాధించాలని అధికారులు ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కె. పద్మావతి, అంగన్వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది మరియు కిశోర బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు స్థానికులు అధికారులను అభినందించారు.

## ఆటోనగర్‌లో మోదీ దిష్టిబొమ్మ దహనం..




### పెరిగిన డీజిల్, గ్యాస్ ధరలపై ఆగ్రహం..

**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, మే 15, న్యూస్ ఇండియా ప్రతినిధి:**ఆటోనగర్‌లో తెలంగాణ రాష్ట్ర ఇసుక లారీ యజమానుల సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తూ డీజిల్, పెట్రోల్, కమర్షియల్ గ్యాస్ ధరల పెంపుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఇసుక లారీ యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డీజిల్ ధరలను ఒక్కసారిగా మూడు రూపాయలు పెంచడంతో రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను భారీగా పెంచడంతో చిన్న వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు, గ్యాస్ ఆధారంగా జీవనోపాధి పొందుతున్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భారత రాష్ట్ర సమితి పార్టీ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమయంలో డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరల పెంపు పేద, మధ్యతరగతి ప్రజలపై మరింత భారం మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర ?3,251.50కు చేరిందని, దీనివల్ల హోటళ్లు, చిరు వ్యాపారాలపై తీవ్ర ప్రభావం పడుతోందని విమర్శించారు. ఎన్నికల ముందు గ్యాస్ కొరత లేదని చెప్పిన కేంద్ర ప్రభుత్వం, ఎన్నికలు పూర్తయ్యాక అమాంతం ధరలు పెంచడం ప్రజలను మోసం చేయడమేనని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులను సాకుగా చూపుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. "అచ్చే దిన్" అంటూ అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలకు కష్టాలు మిగిల్చిందని మండిపడ్డారు. పెంచిన కమర్షియల్ గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, గ్యాస్ సబ్సిడీని పునరుద్ధరించాలని, పెట్రోల్, డీజిల్ ధరలను అదుపులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట లారీ యూనియన్ అధ్యక్షుడు నర్రి వెంకన్న, ఆటోనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీశ్ యాదవ్, ఉపాధ్యక్షుడు గుండు లింగన్న గౌడ్, సుర్వి శేఖర్ గౌడ్, లారీ యజమానులు సుర్వి నర్సింహా, రమేష్, లింగస్వామి, ఏర్పుల రాజేష్, నాగరాజు, హనుమంతు, శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ సిటీ బ్యూరో న్యూస్ ఇండియా ప్రతినిధి (రవీందర్)**వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానమును ఈ రోజు ఉదయం వరంగల్ పశ్చిమ ఎం.ఎల్.ఏ శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి- నీలిమ దంపతులు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఎం.ఎల్.ఏ దంపతులకు ఆలయ ధర్మకర్తలు శ్రీయుతులు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, శ్రీమతి మయూరి రామేశ్వర్రావు, శ్రీమతి గాండ్ల స్రవంతి, బింగి సతీష్, జారతి వెంకటేశ్వర్లు, పాలడుగుల ఆంజనేయులు, సిరివోలు శ్రీధర్ రావు, ఈ.ఓ శ్రీమతి రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. ముందుగ గోశాలలో గోవు ప్రదక్షిణ చేసి గోగ్రాసం పెట్టి ఆదిశంకరాచార్యులను, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు ఆధ్వర్యవమున అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.
అనంతరం దేవాలయములో నూతనముగా నిర్మాణం జరుగుచున్న మాడవీధులలో అమ్మవారి రథ సేవ నిర్వహించుటకు తయారు చేయించుచున్న నూతన రథ నిర్మాణమునకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.ఎల్.ఏ రథ శిల్పి శ్రీ ప్రవీణ్ ఆచార్యకు వీలైనంత త్వరగా రథ నిర్మాణం పూర్తిచేయాలని, రథములో ఏలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని తెలిపారు .

## భర్తను మోసం చేసి మరో పెళ్లి.. విషయం తెలిసిన భర్త సూసైడ్..



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, మే 15 న్యూస్ ఇండియా ప్రతినిధి:** ఎల్బీనగర్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విషాద ఘటన స్థానికంగా కలకలం రేపింది. కొహెడ గ్రామానికి చెందిన పల్లపు గోవర్ధన్ అనే యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గోవర్ధన్ నాలుగేళ్ల క్రితం సరిత గౌడ్ అనే యువతిని ప్రేమించి ఇంట్లో వారికి తెలియకుండా వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక బాబు కూడా ఉన్నట్లు తెలిపారు. అయితే ఇటీవల సరిత గౌడ్ మరో వ్యక్తిని వివాహం చేసుకుందని, తమ బాబును ఇతరులకు అమ్మేశానని గోవర్ధన్‌కు చెప్పినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంతో తీవ్ర మనస్థాపానికి గురైన గోవర్ధన్.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘటనపై హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినప్పటికీ ఇప్పటివరకు నిందితురాలిని అరెస్టు చేయలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమ మనవడు ఎక్కడున్నాడో కూడా తెలియజేయడం లేదని గోవర్ధన్ తల్లి మీడియా ముందు కన్నీటి పర్యంతమైంది. మరణానికి ముందు పల్లపు గోవర్ధన్ తన ఫోన్‌లో పలు వీడియోలు రికార్డు చేసి బంధువులకు పంపినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఘటన జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోకపోవడంపై బాధిత కుటుంబం పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పోలీసులు ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

## ప్రజా వేదిక కు విశేష స్పందన

### నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు 16 ఫిర్యాదులు స్వీకరణ



**న్యూస్ ఇండియా** పల్నాడు జిల్లా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు శుక్రవారం తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం " ప్రజా వేదిక " కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ జాన్ సైదా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 16 అర్జీలు అందాయి. అందిన ఫిర్యాదుల్లో అధికంగా పెన్షన్‌కు సంబంధించినవి ఉండగా, గృహ నిర్మాణానికి సంబంధించిన సమస్యలు, ముఖ్యమంత్రి సహాయ నిధి (సి ఎం ఆర్ ఎఫ్) కోసం దరఖాస్తులు కూడా ఉన్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ.. ప్రజా వేదిక ద్వారా వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కారం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## ప్రియదర్శిని కాలనీలో వ్యక్తి అదృశ్యం..



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, మే 15, న్యూస్ ఇండియా ప్రతినిధి:** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రియదర్శిని కాలనీలో నివాసం ఉంటున్న కడుగు యాకూబ్ (55) అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. ఈ నెల 14న భార్యతో నగదు విషయంలో వాగ్వాదం అనంతరం ఇంటికి వెల్లిన యాకూబ్ తిరిగి కనిపించలేదు. సాయంత్రం ఇంటికి చేరుకున్న భార్య బంధువుల ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. యాకూబ్ ఆచూకీ తెలిసిన వారు హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

మానవ చరిత్రలో యుద్ధాలెప్పుడూ రెండు ముఖాలు కలిగిన నాణేలే. ఒకవైపు అప్పుల భారం మోస్తున్న దేశాల్లో లక్షలాది సామాన్యుల కన్నీళ్లు.. మరోవైపు కార్పొరేట్ కంపెనీల ఖజానాలో పోగుపడుతున్న కాసులు. ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం సైతం ఈ చారిత్రక సత్యానికి రుజువే. ఇరాన్ హార్ముజ్‌ను మూసివేసిన క్షణంనుంచీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం అగ్నిపర్వత విస్ఫోటనమైంది. ఫిబ్రవరి చివరినాటికి రవాణా దాదాపు స్తంభించిపోవడంతో ఇంధన మార్కెట్లు రోలర్ కోస్టర్‌గా మారాయి. పెట్రోల్ ధరలు భగ్గుమన్నాయి. రవాణావ్యయాలు అదుపుతప్పి.. నిత్యావసరాలు మండుతున్నాయి. సామాన్యుడి బడ్జెట్లు అతలాకుతలమయ్యాయి. ప్రభుత్వాలు సబ్సిడీల భారంతో సతమతమయ్యాయి. చిన్న వ్యాపారులు, రైతులు, కూలీలు -ఒక్కమాటలో చెప్పాలంటే ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని నడిపించే సామాన్యులు తట్టుకోలేని ఒత్తిడిలో చిక్కుకున్నారు. అయితే -ఇదే సంక్షోభం నేపథ్యంలో ప్రపంచంలోని కొన్ని పెద్ద కంపెనీలు మాత్రం చరిత్రలోనే అత్యధిక లాభాలను కళ్లజూస్తున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు. ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ నైజం. ఒకరి విషాదం మరొకరి వ్యాపార అవకాశంగా మారే క్రూర వాస్తవం కళ్లముందు కనిపిస్తోంది. ఈ సంక్షోభంలో అత్యధికంగా లాభపడిన వర్గాల జాబితాలో మొదట నిలిచేవి చమురు, సహజ వాయు కంపెనీలు. బ్రిటిష్ పెట్రోలియం మొదటి మూడు నెలల్లోనే లాభాలు రెండింతలు పెంచుకుని 3.2 బిలియన్ డాలర్లకు చేరింది. విశ్లేషకుల అంచనాలను మించి.. షెల్ 6.92 బిలియన్ డాలర్ల లాభాలను ప్రకటించింది. టోటల్ ఎనర్జీస్ తన లాభాలను 29 శాతం పెంచుకుని 5.4 బిలియన్ డాలర్లకు చేర్చింది. ఈ కంపెనీలకు సొంత ట్రేడింగ్ విభాగాలుండటంతో, ఈ మూడు యూరోపియన్ దిగ్గజాలు యుద్ధం కారణంగా 2025 చివరి క్వార్టర్‌తో పోలిస్తే 2026 తొలి క్వార్టర్‌లో అదనంగా 3.3 బిలియన్ నుంచి 4.75 బిలియన్ డాలర్ల ట్రేడింగ్ లాభాలు పిండుకున్నాయి. సామాన్య మనిషి పెట్రోల్ బంక్‌వద్ద గుండె చేతిలో పట్టుకుని ధర చూస్తుంటే, ఈ కంపెనీల బోర్డ్‌రూమ్‌లో జరుపుకున్న పండగ ఇది. ఇంధనరంగం మాత్రమే కాదు, వాల్ స్ట్రీట్ బ్యాంకులు సైతం యుద్ధాన్ని అనుకూలంగా మార్చుకున్నాయి. జేపీ మోర్గాన్ ట్రేడింగ్ విభాగం రికార్డుస్థాయిలో 11.6 బిలియన్ డాలర్ల ఆదాయం ఆర్జించింది. ఇది ఏడాది క్రితంతో పోలిస్తే 20 శాతం ఎక్కువ. బ్యాంక్ ఆఫ్ అమెరికా, మోర్గాన్ స్టాన్లీ, సిటీ గ్రూప్, గోల్డ్‌మన్ సాక్స్, వెల్స్ ఫార్గోతో కలిపి ఈ ఆరు బ్యాంకులు మొత్తం 47.4 బిలియన్ డాలర్ల లాభాలు నమోదు చేశాయి, ఒక్క త్రైమాసికంలో! యుద్ధ భయంతో పెట్టుబడిదారులు రిస్క్ ఉన్న ఆస్తులు వదిలించుకుని సురక్షితమైన పెట్టుబడుల వేట మొదలుపెట్టారు. ఈ హడావుడిలో జరిగిన భారీ ట్రేడింగ్ లావాదేవీలు నేరుగా బ్యాంకుల లాభాలుగా మారాయి. ఒకవైపు పెట్టుబడులు నష్టపోతున్న చిన్న ఇన్వెస్టర్లు, మరోవైపు ఆ అస్థిరత నుంచి లాభపడే పెద్ద బ్యాంకులు -ఈ వైరుధ్యం ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అసమానతలకు అద్దం పడుతుంది. రక్షణ రంగం కూడా ఈ జాబితాలో ముందు వరుసలో ఉంది. నార్త్‌రోప్ గ్రూమ్మన్ ఒక్క క్వార్టర్‌లోనే 9.8 బిలియన్ డాలర్ల కొత్త ఆర్డర్లు సాధించి, మొత్తం 96 బిలియన్ డాలర్ల బ్యాక్‌లాగ్‌ను నిర్మించుకుంది. ఆ సంస్థ నికర లాభం 481 మిలియన్ల నుంచి 875 మిలియన్ డాలర్లకు ఎగిసింది.

## యుద్ధం వెనుక బ్యాలెన్స్‌షీట్!

లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, బీఏఈ సిస్టమ్స్‌వంటి ఇతర ఆయుధ దిగ్గజాలు కూడా రికార్డు ఆర్డర్లు పేరుకుపోయినట్టు నివేదించాయి. ఈ సంఘర్షణ వాయు రక్షణలోని లోపాలను బహిర్గతం చేయడంతో, ప్రభుత్వాలు మిస్సైల్ డిఫెన్స్, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, మిలిటరీ హార్డ్‌వేర్‌లపై వ్యయం పెంచడానికి పోటీ పడ్డాయి. ప్రభుత్వ ఖజానానుంచి పౌరుల పన్నుల డబ్బు.. కంపెనీల బ్యాలెన్స్ షీట్‌లలోకి వెళ్లిపోయింది. ఒక దేశంలో మనిషి గాయపడితే, వేరే దేశంలో ఆయుధ కంపెనీ లాభపడుతుంది. ఈ సమీకరణ ఎంత నిర్దాక్షిణ్యంగా పనిచేస్తుందో అంకెలు చెప్తున్నాయి.

అయితే ఈ సంక్షోభం మరో కోణంలో ఒక అవకాశాన్ని కూడా తెరిచింది. పునరుత్పాదక ఇంధన రంగంవైపు ప్రపంచం వేగంగా మళ్లడం. హార్మ్యూజ్ జలసంధి మూసుకుపోవడంతో ప్రపంచ ఇంధన భద్రత ఎంత దుర్బలంగా ఉందో బట్టబయలైంది. ట్రంప్ ప్రభుత్వం 'డ్రిల్ బేబీ డ్రిల్' అని నినాదమిస్తున్నా, వాస్తవ పరిస్థితులు వేరేదిశగా నడిచాయి. ఫ్లోరిడాకు చెందిన నెక్స్ట్ ఎరా ఎనర్జీ షేర్లు ఈ

## సంపాదకీయం

ఏడాది 17 శాతం పెరిగాయి. డానిష్ విండ్ పవర్ దిగ్గజాలు వెస్టాస్, ఓర్‌స్టెడ్ భారీ లాభాలు ప్రకటించాయి. బ్రిటన్‌కు చెందిన ఆక్టోపస్ ఎనర్జీ ప్రకారం, ఫిబ్రవరి చివరి నుంచి సోలార్ ప్యానెల్స్ అమ్మకాలు 50 శాతం ఎగిసాయి. హీట్ పంప్ అమ్మకాలు ఒక్క మార్చి తొలి మూడు వారాల్లోనే 51 శాతం పెరిగాయి. ఈవీ చార్జర్ అమ్మకాలు 20 శాతం ఎగిశాయి. పెట్రోల్ ధరల మంట భరించలేక ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలవైపు మొగ్గు చూపడంతో ఆ రంగంలో డిమాండ్ పెరిగింది. ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతుంది. పునరుత్పాదక ఇంధన రంగం లాభపడటం నిజంగా సానుకూలమైన మార్పుకు సంకేతమా? లేదా కార్పొరేట్ ప్రపంచం ఏ సంక్షోభాన్నయినా సొమ్ము చేసుకోగలిగే నైపుణ్యానికి మరో రూపమా? ఈ రెండూ కొంతవరకు నిజమే. సౌరశక్తి, పవన విద్యుత్‌వైపు వెళ్లడం దీర్ఘకాలంలో సానుకూలమే అయినా, ఆ మార్పు కూడా ఒక సంక్షోభం నడిపిస్తుందంటే అందులో చేదు వాస్తవముంది. మొత్తంగా ఈ యుద్ధం మనకు నేర్పిన పాఠమేమిటంటే -ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటే ఈ విధంగా ఉంది. సంఘర్షణలు, సంక్షోభాలు, అస్థిరతలు సామాన్యుల జీవితాలను కుదేలు చేస్తాయి కానీ, అదే సమయంలో నిర్దిష్ట వ్యవస్థల్లో పాగా వేసిన పెద్ద కంపెనీలు అస్థిరతనుంచే లాభం పిండుకుంటాయి. ఈ వైరుధ్యాన్ని గుర్తించడం, చర్చించడం, సవాలు చేయడం -అదే ఒక జాగ్రత్తగల ప్రజాస్వామిక సమాజం చేయగలిగే అత్యంత ముఖ్యమైన పని. చరిత్రలో ప్రతి యుద్ధం, ప్రతి సంక్షోభం ఇదే నమూనానే అనుసరించింది. మొదటి ప్రపంచ యుద్ధంనుంచి ఇరాక్ యుద్ధం వరకు, కోవిడ్ మహమ్మారినుంచి ఉక్రెయిన్ సంఘర్షణ వరకు, లాభాల వేటలో ఉన్న వ్యవస్థ ఎప్పుడూ సామాన్యుని కష్టాలనే తన ఆయుధంగా మలచుకుంది. ఈ నిర్దాక్షిణ్య నమూనాను ఛేదించాలంటే కేవలం ప్రభుత్వాలపై విమర్శలు సరిపోవు పౌర సమాజం, మీడియా, పరిశోధకులు, విద్యావేత్తలు కలిసి ఈ లాభాల గణితాన్ని బట్టబయలు చేయాల్సిన అవసరముంది. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడం కాదు; సంఖ్యల వెనుక దాగున్న సత్యాలను ప్రశ్నించడం కూడా!!

# పసిఫిక్‌లో భారత్ నిశ్శబ్ద వ్యూహం



సుదూర పసిఫిక్ మహాసముద్రంలో చిన్న చిన్న ద్వీపాలు చల్లటి అలల మధ్య తేలుతుంటాయి. ఆ ద్వీపాల గురించి వార్తల్లో అమెరికా, చైనా, ఆస్ట్రేలియా, జపాన్ పేర్లే వినిపిస్తుంటాయి. భారతదేశం ప్రస్తావన అరుదు. కానీ ఇటీవల భారత విదేశాంగ సహాయమంత్రి పవిత్ర మార్గరీటా వనువాటు, తువాలు ద్వీపదేశాల్లో పర్యటించడం ఈ నిశ్శబ్దాన్ని ఛేదించింది. ఇది కేవలం దౌత్య పర్యటనే కాదు -భారతదేశం తన భౌగోళిక, వ్యూహాత్మక దృష్టిని పసిఫిక్‌వైపు స్థిరంగా మళ్లిస్తోందని చాటే సంకేతం. 'యాక్ట్ ఈస్ట్' విధానం ఒకప్పుడు ఆగ్నేయాసియా వరకే పరిమితంగా చూసిన వారికి, ఇప్పుడది పసిఫిక్ ద్వీపాల వరకూ విస్తరించడం ఆశ్చర్యం కలిగించవచ్చు. అయితే ఈ విస్తరణ వెనుక స్పష్టమైన ఆలోచన, పటిష్ఠమైన వ్యూహముంది. భారతదేశం పసిఫిక్ ద్వీపదేశాలతో సంబంధాలు పెంచుకోవడం 2014లో ప్రారంభమైంది. పద్నాలుగు పసిఫిక్ ద్వీపదేశాలతో ఒకేసారి దౌత్య సంబంధాలను పటిష్ఠం చేయాలని నిర్ణయించినప్పుడు అది కొత్త అధ్యాయానికి తెరలేపింది. అప్పటి నుంచి ఈ దశాబ్దం పైగా కాలంలో ఆ సంబంధాలు క్రమంగా, నిదానంగా, నిరంతరంగా పరిపక్వం చెందాయి. మార్గరీటా తాజా పర్యటన ఆ పరిణామ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి. వనువాటు ప్రధాని జోథమ్ నాపట్‌తో సమావేశం, విదేశాంగ మంత్రి జేవియర్ ఇమాన్యుయెల్ హ్యారీతో ద్వైపాక్షిక చర్చలు -ఇవి కేవలం సౌజన్య భేటీలు కావు. డిజిటల్ అభివృద్ధి, వాతావరణ మార్పుల నిభాయింపు, ఆర్థిక సహకారంవంటి సుస్థిరమైన అంశాలపై జరిగిన లోతైన సంభాషణలు. భారత్ సహకారంతో వనువాటులో నడుస్తున్న సమాచార సాంకేతిక ఉత్కృష్ట శిక్షణ కేంద్రం -సీఈఐటీను మంత్రి స్వయంగా సందర్శించి అక్కడి విద్యార్థులతో మాట్లాడటం అర్థవంతమైన సంకేతం. ఆహార ధాన్యాల సరఫరా, అదనపు ఐటీ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సహాయం, 'హీల్-ఇన్-ఇండియా' కార్యక్రమం కింద వనువాటు రోగులకు భారతదేశంలో వైద్య చికిత్స -ఇవన్నీ ఆచరణలో కనిపించే నిబద్ధత. తువాలులో సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ కోసం చెక్కు అందజేయడం, సముద్ర అంబులెన్స్ సదుపాయం కల్పించడం ఈ చిన్న చిన్న సాయాలు పెద్ద నమ్మకాన్ని నిర్మిస్తాయని భారత్‌కు తెలుసు.

వనువాటు, తువాలువంటివి వందల కిలోమీటర్ల విస్తీర్ణంలో లక్షల జనాభా కూడా లేని చిన్నపాటి ద్వీపదేశాలు. మరి వీటిపై ఇంత దృష్టి ఎందుకు? సమాధానం ఒక్కటే -వ్యూహాత్మక ప్రాధాన్యం. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో కీలకమైన సముద్ర మార్గాల మధ్య ఉన్న ఈ ద్వీపాలు, భవిష్యత్తులో ప్రపంచ రాజకీయాల్లో చదరంగపు గడులు. ప్రపంచ వాతావరణ చర్చల్లో ఈ చిన్న ద్వీపదేశాలదే ప్రధాన స్వరం. ముఖ్యంగా తువాలు సముద్ర మట్టం పెరుగుదల వల్ల అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఐక్యరాజ్యసమితిలో ఈ దేశాల ఓట్లు, అంతర్జాతీయ వేదికలపై వాటి మద్దతు -ఇవన్నీ చిన్నవిగా కనిపించినా, మొత్తంగా కలిపితే పెద్ద తూకమే. అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌వంటి సంప్రదాయ శక్తులు ఎప్పటినుంచో ఇక్కడ పలుకుబడి కలిగి ఉన్నాయి. అయితే ఇటీవలి కాలంలో చైనా కూడా ఈ ద్వీపదేశాల్లో వేగంగా పాగా వేస్తోంది, భారీ మౌలిక సదుపాయ ప్రాజెక్టులు, రుణ ఒప్పందాలు, దౌత్య మద్దతు ద్వారా! ఈ పెరుగుతున్న పోటీ నేపథ్యంలో భారత్ పసిఫిక్ ప్రాంతంలో చురుగ్గా ఉండటం అత్యంత అవసరమైంది.

అయితే భారతదేశం తన పోటీదారులతో పోటీ పడే పద్ధతిలో కాకుండా, తన సొంతమార్గంలో ముందుకు వెళ్తోంది. చైనా తరహాలో అప్పులతో కూడిన మౌలిక సదుపాయ ప్రాజెక్టులు కాదు.. భారత్ ఎంచుకున్న దారి నైపుణ్య అభివృద్ధి, మానవ వనరుల పెంపు. ఐటీ రంగంలో శిక్షణ ఇవ్వడం, వైద్య సహాయం అందించడం, ఆహార భద్రతకు తోడ్పడటం -ఇవి తక్షణ రాజకీయ లాభాల కోసం చేసే పెట్టుబడులు కాదు. దీర్ఘకాలిక విశ్వాసాన్ని నిర్మించే కృషి. ఒక దేశం మీకు రోడ్లు కడతామని వస్తే, మరొకరు మీ పిల్లలకు నైపుణ్యాలు నేర్పిస్తామని వస్తే -రెండిటిలో ఏది స్థిరమైన బంధాన్ని నిర్మిస్తుందో చెప్పే అవసరం లేదు. ఈ తేడాను పసిఫిక్ ద్వీపదేశాలు అర్థం చేసుకుంటున్నాయి. అందుకే భారత్‌ను ఒక నమ్మకమైన భాగస్వామిగా ఆదరిస్తున్నాయి. ఇవి కేవలం సహాయం మీద ఆధారపడే చిన్న దేశాలు కాదని, అభివృద్ధిలో, భౌగోళిక రాజకీయాల్లో ఉమ్మడి భాగస్వాములని భారత్ చెప్పడం -ఈ సంబంధాన్ని మరింత సమాన స్థాయిలో నిలబెడుతుంది, గౌరవంగా చేస్తుంది.

మార్గరీటా పర్యటన ముగిసింది. కానీ దాని ప్రభావం మాత్రం చాలాకాలం నిలిచి ఉంటుంది. భారత మంత్రులు వరసగా వనువాటులో పర్యటించడం -ఇది పసిఫిక్ ద్వీపాలకు భారత్ ఇస్తున్న ప్రాధాన్యానికి స్పష్టమైన సంకేతం. ఇండియా-పసిఫిక్ ద్వీపదేశాల సహకార వేదిక (ఫిపిక్) ద్వారా, యాక్ట్ ఈస్ట్ విధానం ద్వారా ఈ సంబంధాలు మరింత విస్తరిస్తాయి, బలపడతాయి. ఒకప్పుడు భారతదేశానికి అటు ఆగ్నేయాసియా వరకు కూడా తన ప్రభావం విస్తరించడం సవాలుగా ఉండేది. ఇప్పుడు అది పసిఫిక్ మహాసముద్రం మధ్యలో ఉన్న చిన్న ద్వీపాల్లో కూడా తన ముద్ర వేస్తోంది.. నిశ్శబ్దంగా, నిరాడంబరంగా, నిర్ణయాత్మకంగా. ప్రపంచ రాజకీయాల్లో గొంతు పెంచాలంటే గొడవలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. నమ్మకాన్ని నిర్మించగలిగితే చాలు. ఆ పాఠాన్నే భారత్ పసిఫిక్‌లో ఆచరణలో చూపిస్తోంది. ఈ నిశ్శబ్ద వ్యూహం వెనుక మరో కీలకమైన కోణం కూడా దాగి ఉంది. అది ప్రవాస భారతీయుల వారసత్వం. ఫిజీ, పపువా న్యూ గినియా వంటి దేశాల్లో శతాబ్దాల కిందటే స్థిరపడిన భారత మూలాల ప్రజలు ఆ సమాజాలతో సహజమైన సాంస్కృతిక వంతెనలుగా నిలిచారు. యోగా దినోత్సవాలు, హిందీ భాషా శిక్షణ, ఆయుర్వేద కేంద్రాలు, బాలీవుడ్ సంగీత ప్రభావం.. ఇవన్నీ 'సాఫ్ట్ పవర్' అని పిలువబడే మెత్తని ప్రభావ సాధనాలు. ఇంకా చెప్పాలంటే, పసిఫిక్ ద్వీపాలు ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రమాదం -వాతావరణ సంక్షోభం విషయంలో భారతదేశం 'గ్లోబల్ సౌత్' గొంతుకగా అంతర్జాతీయ వేదికలపై వాటి పక్షాన నిలబడుతోంది. చైనా చేయగలిగేది భారీ నిర్మాణాలు మాత్రమే అయితే, భారత్ చేయగలిగేది మనుషుల మధ్య సంబంధాన్ని కలిపే వంతెనలు, ఉమ్మడి ఆందోళనలపై ఒకే గొంతుక. అదే ఈ దౌత్య ప్రయాణానికి అసలైన బలం. ఇది ఇనుప కడ్డీలతో నిర్మించేది కాదు, నమ్మకంతో అల్లే బంధం!




## మార్కులు సరే.. మనుగడ సంగతి?

బాటనీ ప్రాక్టికల్ పరీక్షలో ఒక విద్యార్థిని గోధుమలను చూసి గుర్తుపట్టలేకపోయింది. ఆ అమ్మాయి ప్రతిరోజూ చపాతీలు తింటుంది. కానీ చపాతీ పిండి ఎక్కడి నుంచి వస్తుందో తెలియదు. ఇది ఒక్క విద్యార్థిని వైఫల్యం కాదు. మన విద్యా వ్యవస్థకు, పెంపకానికి పట్టిన అద్దం. నగరాల్లో పెరిగే పిల్లలకు ఇల్లు, స్కూలు, పరీక్షలు, మాల్స్.. ఇవే వారి ప్రపంచం. కూరగాయల పేర్లు సరిగ్గా తెలియవు. మార్కెట్లో పప్పుధాన్యాలను గుర్తుపట్టలేరు. బియ్యం పెద్ద చెట్లకు కాస్తాయని భావించే పిల్లలూ ఉన్నారు. ఇది నవ్వుకునే విషయం కాదు, ఆలోచించాల్సిన విషయం.

పాఠ్య పుస్తకాల్లో నేర్చుకున్న జ్ఞానానికి, నిజ జీవితానికి మధ్య పెరిగిపోతున్న ఈ దూరమే అసలు సమస్య. ఒక విత్తనం నేలలో పడి మొలకెత్తి, పంటగా మారి, మన పళ్లెంలో అన్నంగా కూర్చుంటుంది. ఈ ప్రయాణం పిల్లలకు తెలియకపోవడం వల్ల వారికి ఆహారంతో, ప్రకృతితో, శ్రమతో అనుబంధమే లేకుండా పోతోంది. బ్యాంకు ఎలా పనిచేస్తుందో, పోస్టాఫీసుకు ఎందుకు వెళ్తారో, ప్రభుత్వ కార్యాలయంలో ఏం జరుగుతుందో -ఇవన్నీ తెలియని యువత రేపటి సమాజంలో సమర్థంగా నిలబడగలదా అన్నది సందేహమే.

పరిష్కారం చాలా సులభం. పిల్లలను బయటికి తీసుకెళ్లడం. సెలవుల్లో పొలం చూపించండి. రైతు పని అర్థం చేయించండి. ధాన్యం ఇంటికి చేరే వరకు జరిగే ప్రతి మార్పూ వివరించండి. పరిసరాల్లోని చెట్లను, వాటిపై వాలే పక్షులను పరిచయం చేయండి. నీటి వనరులు, పాడి పశువుల పెంపకం, రోజువారీ వ్యవహారాలు -వీటన్నిటిలో పిల్లలను భాగస్వాములను చేయండి. పుస్తకాల్లో చదివిన విషయాలు అనుభవంలోకి దిగినప్పుడే అవి నిజమైన విద్యగా మారతాయి. బావిలో కప్పలకు బయటి ప్రపంచం కనిపించదు. మన పిల్లలు అలా కాకూడదంటే, మనమే వారికి ఆ కిటికీ తెరవాలి.

ఒకప్పుడు ఇంట్లో నానమ్మ, తాతయ్యలు, పక్కింటి పెద్దలు పిల్లలకు సహజమైన పాఠశాలలుగా ఉండేవారు. "ఈ ఆకును గుర్తుపట్టు. ఈ పక్షి పేరేమిటో చెప్పు. ఈ చేను ఎలా దున్నుతారో చూడు" అని ప్రతి మాటలో ఒక పాఠం ఉండేది. ఇప్పుడు ఆ స్థానంలో స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌లు వచ్చి కూర్చున్నాయి. కోవిడ్ తర్వాత పిల్లల ప్రపంచం మరింత కుచించుకుపోయింది. క్లాస్‌రూమ్ నుంచి ఆన్‌లైన్ క్లాస్‌కు, ఆన్‌లైన్ క్లాస్ నుంచి యూట్యూబ్ షార్ట్‌లకు, షార్ట్‌లనుంచి గేమ్‌లకు. ఈ సంకుచిత చక్రాన్ని ఛేదించే బాధ్యత తల్లిదండ్రులదే, ఉపాధ్యాయులదే, సమాజానిదే. వారాంతంలో ఒక గంట కూరగాయల మార్కెట్‌కు, నెలకొకసారి ఒక గ్రామానికి, ఏడాదికొక్కసారైనా ఒక పొలానికి తీసుకెళ్తే.. ఆ పిల్లల జీవితంలో పుస్తకాలు ఇవ్వలేని విలువైన పాఠాలు చేరతాయి. అది వారి భవిష్యత్ జీవన గమనాన్నే మార్చేస్తాయి.



గడిచిన నిన్న తిరిగి రాదు. రాబోయే రేపు ఇంకా చేతికి అందలేదు. మన దగ్గర ఉన్నది ఈ క్షణం మాత్రమే. దాన్ని వదులుకుంటే మళ్ళీ అడిగే అవకాశం లేదు. సమయం నీకోసం ఆగదు.. నువ్వే సమయంతో పరిగెత్తాలి.

ప్రతిరోజూ అద్దం ముందు నిలబడతావు కదా.. అందులో కనిపించే మనిషి నిన్న కంటే మెరుగ్గా ఉన్నాడా? లేదా? ఆ సమాధానమే నీ క్రమశిక్షణకు అసలైన పరీక్ష. బయటి ప్రపంచం నిన్ను కొలవడానికి ముందే.. నువ్వు నిన్ను నువ్వు కొలుచుకోవాలి.

-మహాదేవ

వింతల్లో వింతలు

## సముద్రం మిస్సైన లైట్‌హౌస్



రష్యాలోని ఆస్త్రఖాన్ ప్రాంతంలో విశాలమైన ఎడారి స్టెప్పీ మధ్య ఒక వింత నిర్మాణం ఆకాశంవైపు చూస్తూ నిలబడి ఉంది. ఇది ఒక లైట్‌హౌస్. సాధారణంగా సముద్ర తీరంలో మాత్రమే కనిపించాల్సిన నిర్మాణం, ఇక్కడ మాత్రం కాస్పియన్ సముద్రం నుండి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో, పొడి భూమి మధ్యలో ఒంటరిగా నిలబడి ఉంది. దీని పేరు 'పెట్రోవ్‌స్కీ లైట్‌హౌస్'. దీని వెనుక చరిత్ర ఆసక్తికరం. 1722లో పీటర్ ది గ్రేట్ చక్రవర్తి పర్షియా దాడి సమయంలో ఈ ప్రాంతంలో ఆగాడు. తిరిగి వెళ్లిన తర్వాత, వోల్గా నది నౌకాశ్రయ ప్రవేశం వద్ద ఉన్న ఒక ద్వీపంపై లైట్‌హౌస్ నిర్మించమని ఆజ్ఞాపించాడు. మొదట కలపతో కట్టారు. 1856 తుఫానులో అది కూలిపోయింది. తర్వాత ఇటుకలతో 20 అంతస్తుల ఎత్తులో మళ్లీ నిర్మించారు. కానీ కాలం గడిచేకొద్దీ కాస్పియన్ సముద్రం క్రమంగా వెనక్కి తగ్గుతూ వచ్చింది. ద్వీపం మొదట ఒడ్డుగా, తర్వాత పూర్తి నేలగా మారింది. 1930 నాటికి సముద్రం పూర్తిగా దూరమైంది. లైట్‌హౌస్ పని ఆగిపోయింది. 1990లలో ఒక చిన్న రేడియో స్టేషన్‌గా కొంతకాలం పనిచేసిన ఈ నిర్మాణం, ఇప్పుడు జాతీయ స్మారక చిహ్నంగా గుర్తింపు పొంది, వింత పర్యాటక ఆకర్షణగా మారింది.



## సైలెంట్‌గా వచ్చేసిన నాగశౌర్య ఫ్లాప్

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నాగశౌర్య హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రమే 'బ్యాడ్ బాయ్ కార్తీక్'. పెద్దగా హడావుడి లేకుండానే థియేటర్స్‌లో వచ్చిన ఈ చిత్రం అసలు వచ్చినట్టు కూడా చాలామందికి తెలియదు. అయితే ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో కూడా చప్పుడు లేకుండా వచ్చేసింది. ఈ చిత్రాన్ని అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకోగా అందులో ఇవాల్టినుంచే సినిమా అందుబాటులోకి వచ్చేసింది. సో ఈ ఫ్లాప్ చిత్రాన్ని చూడాలి అనుకునేవారు అమెజాన్‌లో చూడొచ్చు. ఇక ఈ చిత్రాన్ని కొత్త దర్శకుడు రమేష్ దేసిన తెరకెక్కించాడు. కేవలం యాక్షన్ పార్ట్ వరకు బాగా తీసి మిగతా కథా కథనాలు అవుట్ డేటెడ్‌గా నడిపించడంతో సినిమా భారీ ఫ్లాప్ అయ్యింది. ఇక ఈ చిత్రంలో నటి శ్రీదేవి విజయ్‌కుమార్, సముద్రఖని తదితరులు కీలక పాత్రల్లో నటించగా విధి యాదవ్ హీరోయిన్‌గా నటించింది. అలాగే హరీష్ జైరాజ్ సంగీతం అందించిన సినిమాని శ్రీనివాసరావు చింతలపూడి నిర్మాణం వహించారు.

## డ్రాగన్ ట్రీట్ కోసం ముంబయికి తారక్

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియన్ ఎన్టీఆర్ పుట్టినరోజు పురస్కరించుకుని మే 20న ప్రశాంత్ నీల్ మూవీకి సంబంధించిన ట్రీట్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. అయితే, ఒకరోజు ముందుగానే అంటే మే 19న అర్ధరాత్రి 'డ్రాగన్' చిత్రానికి సంబంధించిన మొదటి గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు చిత్ర బృందం సిద్ధమైంది. ఈ టీజర్ లాంచ్ కోసం ఎన్టీఆర్ స్వయంగా ముంబయి వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అక్కడ నేషనల్ మీడియా సమక్షంలో ఈ ఫస్ట్‌లుక్‌ను ప్రెజెంట్ చేయనున్నట్టు సమాచారం. 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్‌నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. సౌత్ సినిమాలకు నార్త్ మార్కెట్‌లో ఉన్న క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈ సినిమా ప్రమోషన్లను ముంబై నుంచే గ్రాండ్‌గా మొదలుపెట్టాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నాడు. ఇక ఈ చిత్రాన్ని జూన్ 11, 2027లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.



హాట్ స్టార్!




కోమలీ ప్రసాద్




## టామ్‌క్రూజ్ సినిమా కోసం తెలుగు డైరెక్టర్?

విజయవంతమైన 'మిషన్ ఇంపాజిబుల్' చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు హాలీవుడ్ కథానాయకుడు టామ్ క్రూజ్. ప్రస్తుతం ఆయన 'డిగ్గర్' అనే సినిమాతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ హాలీవుడ్ చిత్రం అక్టోబరు 2న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈలోగానే తన తదుపరి సినిమాకి సంబంధించి ఆసక్తికర వార్త బయటకొచ్చింది. ఇప్పుడాయన పారామౌంట్ పిక్చర్స్ సంస్థలో 'డూపెల్‌గాంగర్' అనే స్పై థ్రిల్లర్ చిత్రం చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. దీన్ని తెలుగు మూలాలున్న యువ దర్శకుడు అనీష్ చాగంటి తెరకెక్కించే అవకాశముందని హాలీవుడ్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. 2018లో వచ్చిన 'సెర్చింగ్' అనే చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు అనీష్. ఆయన.. డాన్ ఫ్రే కలిసి రాసిన 'డూపెల్‌గాంగర్' స్క్రిప్ట్‌నే పారామౌంట్ సంస్థ కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఇప్పుడా స్పై థ్రిల్లర్ కథతోనే టామ్ క్రూజ్‌నే అనీష్ సంప్రదించినట్టు తెలిసింది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ విషయమై వీళ్లిద్దరి మధ్య పలుమార్లు చర్చలు జరిగినట్లు సమాచారం. దీనిపై టామ్ నుంచి సూత్రప్రాయంగా అంగీకారం లభించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.



## ట్రోలర్స్‌కు ఆలియా కౌంటర్


కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో బాలీవుడ్ నటి అలియా హొయలొలికించారు. అయితే, ఈ వేడుకలో ఆమెపై కొన్ని విమర్శలు వచ్చాయి. తాజాగా కొందరు ఆమెను ట్రోల్ చేయగా.. వాళ్లకు అలియా తన స్టైల్లో కౌంటర్ ఇచ్చారు. తన ఫ్యాషన్ ఎంపికలతో అందరి దృష్టిని ఆమె ఆకర్షించగా.. రెడ్ కార్పెట్‌పై అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్లు ఆమెను పట్టించుకోలేదని సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు, వీడియోలు వైరల్ అయ్యాయి. "అయ్యో పాపం.. మిమ్మల్ని అక్కడ ఎవరూ గుర్తించలేదు" అని ఒక నెటిజన్ కామెంట్ పెట్టగా.. దీనికి అలియా రిప్లై పెట్టారు. "అయ్యో పాపం అనే మాట ఎందుకులెండి.. మీరు నన్ను గుర్తించారు కదా..!" అని చమత్కారంగా సమాధానమిచ్చారు. ఈ రిప్లై వైరల్ అవుతుండగా.. ట్రోలర్స్‌కు ఎలా బుద్ధి చెప్పాలో మీకు బాగా తెలుసంటూ అలియాను ప్రశంసిస్తున్నారు. మే 12నుంచి 23 వరకు కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఫ్రాన్స్ వేదికగా జరుగుతుంది. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు వారి ఫ్యాషన్ దుస్తులతో ఆకర్షించారు. అలియా భట్ రెడ్ కార్పెట్‌పై మెరవగా.. మరో నటి ఊర్వశీ రౌతేలా లుక్ బాగా వైరలైంది. ఊర్వశీ లుక్ కేన్స్ చరిత్రలోనే అత్యంత విలువైనదని ఫ్యాషన్ నిపుణులు చెప్పారు. ఆమె ధరించిన క్రిస్టల్ గౌను ధర దాదాపు రూ.1,491 కోట్లు ఉంటుందని సమాచారం.



## పెద్దిలో గౌర్నాయుడిగా..

మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ నటిస్తున్న 'పెద్ది' చిత్రానికి సంబంధించి మే 18న ట్రైలర్ లాంచ్ కానుంది. దీనికి ముందే చిత్ర బృందం కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ పోషిస్తున్న 'గౌర్నాయుడు' పాత్రకు సంబంధించిన ఒక చిన్న గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేసి అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో శివరాజ్ కుమార్ కుస్తీ శిక్షకుడిగా నటిస్తున్నారు. ఒక క్రికెటర్‌గా ఉన్న పెద్దిని, తన కఠినమైన శిక్షణ ద్వారా మల్లయోధుడిగా ఆయన ఎలా మార్చారనేది వీడియోలో చూపించారు. ఇక చరణ్‌ను పహిల్వాన్‌గా మార్చడంలో గౌర్నాయుడు ఎలాంటి శిక్షణ ఇవ్వబోతున్నాడనేది మనకు వెండితెరపై అద్భుతంగా చూపెట్టేందుకు చిత్ర యూనిట్ రెడీ అయినట్టు ఈ గ్లింప్స్ చూస్తే అర్థమవుతుంది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తుండగా జూన్ 4న వరల్డ్‌వైడ్‌గా మూవీ గ్రాండ్ రిలీజ్ కానుంది.

## మొత్తానికి మెగాఫోన్ పట్టి..



ఇప్పటివరకూ నటుడిగా, గాయకుడిగా, గేయరచయితగా తన ప్రతిభను చాటుకున్న రామ్ పోతినేని.. ఇప్పుడు దర్శకుడిగా తొలి చిత్రాన్ని రూపొందించేందుకు సిద్ధమయ్యారు. తన 23వ సినిమాకు తానే దర్శకత్వం వహిస్తున్నట్టు ప్రకటించారు. నేడు తన పుట్టినరోజు సందర్భంగా స్వీయ దర్శకత్వంలో రానున్న సినిమా విశేషాలు పంచుకున్నారు. ప్రస్తుతానికి 'రాపో23'గా సినిమా ప్రచారంలో ఉంది. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కించనున్నారు. 'రాపో సినిమాటిక్స్' బ్యానర్‌పై కృష్ణ పోతినేని దీన్ని నిర్మించనున్నారు. ఇందులో రామ్ 'వీర' పాత్రలో కనిపించనున్నారు. లెదర్ జాకెట్‌తో వెనకవైపు నిలబడి ఉన్న ఆయన లుక్ స్టైలిష్‌గా ఆకట్టుకుంటోంది. పోస్టర్‌ను పంచుకుంటూ 'ఒంటరి తోడేలు కథ ఇది' అనే ట్యాగ్‌లైన్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ కథను కూడా రామ్ స్వయంగా సిద్ధం చేసినట్లు సమాచారం. జూన్‌లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించి, డిసెంబర్‌లో సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు. రామ్ పోతినేని యూట్యూబ్‌లో హిందీ డబ్బింగ్ సినిమాలతో నార్త్ ఇండియాలో భారీ క్రేజ్ సొంతం చేసుకున్నారు. హిందీ డబ్బింగ్ సినిమాల ద్వారా 2 బిలియన్లకు పైగా వ్యూస్ సాధించిన తొలి సౌత్ ఇండియన్ హీరోగా రికార్డు సృష్టించారు. 'కందిరీగ', 'నేను శైలజ', 'ఉన్నది ఒక్కటే జిందగీ', 'హలో గురు ప్రేమ కోసమే', 'డబుల్ ఇస్మార్ట్' సహా 9కి పైగా సినిమాలు 100 మిలియన్ల క్లబ్లో చేరాయి. యూట్యూబ్‌లో మిలియన్ సబ్‌స్క్రైబర్స్ మార్క్ అందుకున్న తొలి టాలీవుడ్ హీరోగా గుర్తింపు పొందారు. 'ఇస్మార్ట్ శంకర్' చిత్రం రూ.65 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి రామ్ కెరీర్లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. 11 ఏళ్ల వయసులోనే 'ఆడయాళం' షార్ట్ ఫిలింలో నటించి యూరోపియన్ ఫిల్మ్ ఫెస్టివల్లో ఉత్తమ నటుడు అవార్డు అందుకున్నారు.

Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com